# ప్రేమకు నిర్వచనం




కోటిపల్లి వీర వెంకట సత్యనారాయణ

"రామక్రిష్ణకు మశూచి.........." నిలువునా వణికిపోయింది రాధ. తన బావకు మశూచి— తనకు కాబోయే జీవిత సహచరునికి మశూచి! భగవాన్!! ఎంత నిర్దయుడవయ్యా. నేరంచేస్తే నేరస్థునికి శిక్ష విధిస్తున్నాడు మానవుడు. కాని, ఏ నేరంచేయని బావకు యింత పెద్ద శిక్ష విధించుట నీకున్యాయమా? నీ హృదయం మానవ హృదయంకన్నా కఠిన మైనదా??

కనుకొలకులనుండి కందిన చెక్కిళ్ళ మీదుగా జాలువారే కన్నీటిని జారిపోయే పమిటతో తుడుచు కొని, తిరిగి వుత్తరం చదవటం మొదలుపెట్టింది రాధ.

...మశూచిపడి లేచినప్పటి నుండి రామకృష్ణలో చాలా మార్పు వచ్చింది. ఇదివరకులా వుత్సాహంగా వుండటంలేదు. ఏకాంతతను కోరు కుంటున్నాడు. పిచ్చిగా యేవేవో ఆలోచిస్తాడు. తెలియని బాధ యేదో ప్రవేశించింది వాడిలో. కొన్నాళ్ళు స్థలమార్పు జరిగితే వాడిలో మార్పు రాబట్టవచ్చని మానమ్మకం. అందుకే వాడ్ని విశాఖ పంపిస్తున్నారు నాన్నగారు, రెండు రోజుల్లో. నీ సాన్నిధ్యంలో వాడు తప్పకుండా మారుతాడని నా నమ్మిక.

— ఆశీస్సులతో,
మీ వదిన.

హోరున వీచే సముద్రపుగాలికి డోర్‌కర్టెన్లు పైకి లేచిపోతున్నాయి. రాధ చేతిలో వుత్తరం రెపరెపలాడింది. "బావ అందమైన ముఖం నిండా నల్లని మచ్చలు, గుంటలు.......... భగవాన్!" ఎదురుగా టేబిల్‌మీద ఫోటోలో రామక్రిష్ణ నవ్వుతున్నాడు. ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ వుండే బావ మూగగా తయారయ్యాడా! అందరితో కలసి తను నవ్వుతూ నవ్వించేబావ యీనాడు యేకాంతంగా పిచ్చిగా ఆలోచిస్తున్నాడా! కుదరదు. అలా ఎన్నటికీ కుదరదు. తన బావ మునుపటి మని షిలా కావాలి. బావ అధరాలపై ఎప్పటిలా చిరు నవ్వులు చిందాలి. చిందేలా తను చేయాలి! బావ తనవాడు!! తన బావగురించి తనేమైనా చేయ గలదు; స్థిర నిశ్చయానికి వచ్చినట్టు గంభీరతను పుంజుకొంది రాధ.

స్టేషన్లో, చిరునవ్వులు చిందిస్తూ తనకు స్వాగతం పల్కడానికి వచ్చిన రాధను చూచి యెంతో సంబర పడిపోయాడు రామక్రిష్ణ.

బంగారు కాంతులీనే పసుపు వన్నెగల రాధ ముఖ వర్చస్సూ, ఎన్నెన్నో వింత వింత భావాలు స్ఫురింప జేయగల ఆమె గుండ్రని అందమైన కళ్ళు, లలాటాన్ని తీర్చిదిద్దిన కుంకుమ, సన్నని నడుము, పిరుదు లను జయించిన నల్లని శిరోజాలూ, "అబ్బ! దేవతా సౌందర్యాన్ని మరపించగల రూపసి రాధ. రాధ నిజంగా రాధాదేవే!!" అనుకున్న రామక్రిష్ణ చటుక్కున తన ముఖం చేతో తడుముకున్నాడు. నల్లని మచ్చలూ, గుంటలతో తన ముఖం........ తను కురూపి— రాధ ప్రక్క తను నిజంగావే

